క్లుప్తంగా

నేడు తెనాలిలో జాబ్‌మేళా



తెనాలి అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. దీనికి సంబంధించి కరపత్రాలను శుక్రవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా చదివిన వారు అర్హులన్నారు. 18 - 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని చెప్పారు. వివరాలకు 99888 53335 ఫోను నెంబలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఇ.షీలా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐతానగర్‌లో కుక్కల దాడి



తెనాలి అర్బన్: ఐతానగర్ పేరంటాళ్లమ్మ గుడి వద్ద శుక్రవారం కుక్కలు దాడి చేశాయి. పాదచారులు, వాహనాలపై వెళ్తున్న వారిపై దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

డాక్టర్ అమీర్‌కు ఘన నివాళి



తెనాలి రూరల్: మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ అమీర్‌కు ఐఎంఏ తెనాలి శాఖ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. బోసురోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు హాజరయ్యారు. అమీర్ చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. వైద్యులు కె. అనిల్‌కుమార్, చందు సాంబశివుడు, సాంబిరెడ్డి, రియాజ్‌ఖాన్, మధుప్రభాకర్, డాక్టర్ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

విధులకు సకాలంలో హాజరు కావాలి

తెనాలి అర్బన్: విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు సూచించారు. 4వ శానిటేషన్ డివిజన్ కార్యాలయాన్ని శుక్రవారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ బాధ్యతతో పనిచేసి పారిశుద్ధ్య మెరుగుదలకు కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పనులను పరిశీలించారు. పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



తెనాలి టౌన్: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో శనివారం జరిగే జాబ్ మేళాను నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయం 10- సాయంత్రం 4 గంటల వరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు.

వైద్య పరీక్షలు

కొల్లూరు: బాలింతలు, గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని క్రాపలో వైద్య శిబిరం నిర్వహించారు. కొల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళలతోపాటు, గ్రామంలో వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేశారు.

వరహాపురంలో దోమల మందు పిచికారీ

వరహాపురం(వేమూరు): వరహాపురం గ్రామంలో అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం వల్ల దోమల బెడద ఎక్కువ అయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలో అన్ని వీధుల్లో బ్లీచింగ్, దోమల నివారణకు మందును శుక్రవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ వర్షాల వల్ల దోమలు ఎక్కువయ్యాయని, వాటి నివారణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అన్ని వీధుల్లో వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య చర్యలు ప్రతి రోజు చేపడుతున్నట్లు చెప్పారు.

ధనలక్ష్మీదేవిగా కొలువుదీరిన అమ్మవారు



తెనాలి: బోసురోడ్డు కన్యక పరమేశ్వరి గుడిలో ధనలక్ష్మిగా..



తెనాలి: శ్రీచంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో ధనలక్ష్మి అలంకారం



తెనాలి టౌన్: నందివెలుగు మహాలక్ష్మి దేవి అలంకరణలో కనకదుర్గమ్మ



తెనాలి టౌన్: కఠెవరం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీమహాలక్ష్మిగా..

తెనాలి: దసరా పర్వదినం సందర్భంగా పట్టణంలోని ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్నాయి. ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. అయిదో రోజైన శుక్రవారం ఎక్కువ ఆలయాల్లో అమ్మవారు శ్రీధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

తెనాలి టౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజున శుక్రవారం అమ్మవారు భక్తులకు శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. మండలంలోని నందివెలుగు గ్రామంలోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా కొలువుదీర్చారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.



తెనాలి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నవ చండీహోమం



తెనాలి: మారీసుపేట శ్రీకోదండరామ ఆలయంలో శ్రీమహాలక్ష్మిగా...



తెనాలి: పాత శివాలయంలో అమ్మవారికి శ్రీమహాలక్ష్మీ అలంకారం



శివాజీచౌక్‌లోని శ్రీకాళీమాత ఆలయంలో ధనలక్ష్మిగా అమ్మవారు

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

తెనాలి అర్బన్: ప్రాథమిక వైద్య చికిత్సపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రమేష్ హాస్పటల్ కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ వివేక్ వీరాంరెడ్డి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. గుండె నొప్పి సమయంలో చేసే సీపీఆర్ గురించి తెలిపారు. అనంతరం ఆయనను నిర్వాహకులు సన్మానించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టి.జ్యోతిబసు, కె.కళ్యాణ్ చక్రవర్తి, పి.భార్గవిలు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వివేక్ వీరాంరెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణ

ఆరోగ్యంపై మహిళలు దృష్టి సారించాలి

తెనాలి అర్బన్: ఆరోగ్యంపై మహిళలందరూ దృష్టి పెట్టాలని పినపాటి అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు పేర్కొన్నారు. స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పినపాడులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తుండగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో 10 సంవత్సరాల తరువాత వచ్చే క్యాన్సర్‌ను కూడా నిర్ధారించే పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలలో ఎక్కువగా గర్భాశయ, రొమ్ము, క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఉందన్నారు. అన్ని వయస్సుల మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ రావూరి మౌనిక, డాక్టర్ టి.భార్గవి, డాక్టర్ సుజిత, డాక్టర్ వినోద్‌బాబులు మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పలువురు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో డాక్టర్ హనోక్ బాబు తదితరులు

దైవ వాక్కుతోనే శాశ్వతమైన వేదాలు

తెనాలి: భగవంతుని వాక్కు ద్వారా శాశ్వతమైన వేదాలు పుట్టాయని బ్రాహ్మణ పరిషత్, తెనాలి అధ్యక్షుడు కోట పార్థసారథి అన్నారు. స్థానిక కొత్తపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేద పారాయణ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి చింతపల్లి సాయి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో 50 మందికి పైగా వేద పండితులు పాల్గొన్నారు. పార్థసారథి మాట్లాడుతూ ధ్వని తరంగాల ద్వారా విషయాలు తెలిపేది వేదమని చెప్పారు. అలాంటి వేదాన్ని పారాయణ చేయడం ద్వారా భగవంతుని అనుగ్రహంతో లోకానికి హితం చేకూరుతుందన్నారు. అనంతరం పరిషత్ ఆధ్వర్యంలో పండితులను ఘనంగా సత్కరించారు. కోశాధికారి కామరాజుగడ్డ రాంబాబు, ఉపాధ్యక్షుడు కాజా శ్రీనివాస్, పులిపాక లక్ష్మణకుమార్, గౌరవ సలహాదారు పిడుగు శ్రీనివాస్, పోతుకూచి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు



వేదసభలో పాల్గొన్న పండితులు

పరిసరాల పరిశుభ్రత అవసరం

తెనాలి టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు. గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ప్రతి రోజు కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారం రోడ్లపై వేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య డ్రైవ్‌లో పాల్గొన్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

బంగారు భవిష్యత్తుకు డిగ్రీ విద్య దోహదం

తెనాలి టౌన్: అంకిత భావంతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతంగా రాణించాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు డిగ్రీ విద్య దోహదపడుతుందని ఎస్ఆర్ఐ విద్యాసంస్థల సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఈవో మాట్లాడారు. ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్ది పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తామని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపల్ ఎం.లాజర్‌బాబు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ ఎస్.శివన్నారాయణ, కె.కృష్ణారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈవో ఉమామహేశ్వరరావు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గణపతికి వెండి ఆభరణాల కానుక



తెనాలి: స్థానిక చినరావూరులోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామికి గురువారం భక్తులు, గ్రామస్తులు పలు వెండి ఆభరణాలను సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్‌కు ఆభరణాలను అందజేయగా, అర్చకులు గూడూరు ఈశ్వర భరద్వాజ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వాటిని స్వామివారికి అలంకరించారు. ఆలయ ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలోని విఘ్నేశ్వర స్వామికి గ్రామస్తులు 629 గ్రాములతో వెండి తొండము, నామాలను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు గొల్లమూడి అప్పారావు, గొల్లమూడి వెంకటేశ్వరరావు, సూర్యదేవర శివలింగప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, వాసిరెడ్డి అశోక్ బాబు, సులోచన, పుట్టి శ్రీను, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాటిక, నాటక పోటీల్లో నేడు

- ఉదయం 10.30 గంటలకు: టీజీవీ కల్చరల్ అకాడమీ, కర్నూలు వారి 'శ్రీవెంకటేశ్వర మహాత్మ్యం' (పద్యనాటకం). రచన: శ్రీశారదా ప్రసన్న, దర్శకత్వం: వీవీ రమణారెడ్డి.
- మధ్యాహ్నం 2.30 గంటలకు: పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు అండ్ లలిత కళాపరిషత్, అనంతపురం వారి 'కాలభైరవ సంహారం' (పద్య నాటకం).
- రాత్రి 7.15 గంటలకు: వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి 'నల్లత్రాచు నీడలో' (సాంఘిక నాటకం), రచన, దర్శకత్వం: శ్రీనివాసరావు పోలుదాసు.

– తెనాలి

పంట నమోదు వివరాలు పరిశీలన

చెరుకుపల్లి: ఖరీఫ్ సాగులో పంట నమోదు వివరాలను సూపర్ చెక్ రికార్డుల ద్వారా పరిశీలించటం జరుగుతుందని ఏవో ఎండీ ఫారూక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం, ఆరుంబాక, చెరుకుపల్లి గ్రామాలలో పంట నమోదుకు సంబంధించి సూపర్ చెక్ రికార్డులతో రైతుల పొలాలకు వెళ్లి రైతు పేరు, పంట రకం, సర్వే నంబరు తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేసి సూపర్ చెక్ యాప్‌లో పొందు పరిచినట్టు ఏవో ఫారూక్ తెలియజేశారు.

ఇంటి స్థలం వివాదంలో వ్యక్తిపై దాడి



సమాచారం సేకరిస్తున్న పోలీసులు

కొల్లూరు: ఇంటి స్థలం విషయంలో నెలకొన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారి ఓ కుటుంబం మరో కుటుంబంపై దాడికి తెగబడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు గొడపాలెం గుంట పునుగులు చెట్టు ప్రాంతానికి చెందిన గరికా గోపాలం అనే వ్యక్తికి గరికా నాంచారయ్య అనే వ్యక్తి బంధువులకు మధ్య గత కొద్ది కాలంగా వివాదం జరుగుతుంది. ఇంటి స్థలం వద్ద దారి విషయంలో చోటు చేసుకున్న వివాదం ముదిరి దాడికి దారి తీసింది. స్థల సమస్య కారణంగా ఏర్పడిన పాత కక్షలను మనసులో పెట్టుకున్న గరికా నాంచారయ్య తన కుటుంబ సభ్యులతో కలసి వచ్చి గోపాలం భార్య, అతని సోదరుడిపై దాడి చేస్తుండగా.. విషయం తెలుసుకున్న గోపాలం ఇంటికి వెళ్లాడు. దీంతో నాంచారయ్య గోపాలంపై విచక్షణారహితంగా దాడికి పాల్పడటంతో గోపాలం అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దాడి సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు. స్థానికులు, బాధితుడి బంధువుల సాయంతో పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాడి ఘటనపై ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, వైద్యశాలలో బాధితుడు ఇచ్చే రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఎస్ఐ జానకి అమరవర్ధన్ తెలిపారు.

వరదల వేళ అప్రమత్తత అవసరం

- కృష్ణానదిలో వరద పెరిగే అవకాశాలు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొల్లిపర: ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా రానున్న రెండు రోజుల్లో కృష్ణా నదికి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మండలంలోని బొమ్మువానిపాలెం, అన్నవరపులంక గ్రామాల్లో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలసి కలెక్టర్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలపై ఆరా తీశారు. నదిలో వరద నీరు ఎంత మేరకు వస్తే ప్రమాదం, ఎన్ని లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తే పంటలకు, గ్రామానికి నష్టం జరుగుతుందన్న అంశాలను అధికారులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నది పరీవాహక ప్రాంతాల్లో రైతులు ఏ పంటలు పండిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కృష్ణా నదికి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముందస్తుగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మండల అధికారులు ముందుగా ప్రజలకు సమాచారం అందించినప్పుడు ప్రజలు పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంటు వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వరద పూర్తిగా తగ్గే వరకు అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్ఐ వంశీకృష్ణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



బొమ్మువానిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

శిల్పకళకు వీరరాఘవాచార్యుల సేవ అజరామరం

తెనాలి: సంప్రదాయ శిల్పకళకు దర్శనాచార్య కొండూరు వీరరాఘవాచార్యులు చేసిన కృషి అపూర్వమని 'ఆగమ విద్వాన్', శిల్పకళాభారతి సంచాలకుడు కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య అన్నారు. తెనాలికి చెందిన 'కళాప్రపూర్ణ' కొండూరు వీరరాఘవచార్యులు 113వ జయంతిని శుక్రవారం సాయంత్రం స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించారు. డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు ధర్మనిధి, ఆలపాటి కళావతి రవీంద్ర పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు కళాపీఠం అధ్యక్షుడు అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. వేంకట సత్యబ్రహ్మాచార్య మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో ఎందరినో తీర్చిదిద్దిన డాక్టర్ కొండూరు... వివిధ సాహిత్య ప్రక్రియల్లో 'శిల్పదర్శనము', 'కళారాధన', 'లేపాక్షి' వంటి 40 గ్రంథాలను రచించారని చెప్పారు. శిల్పకళకు ఆయన చేసిన కృషి అజరామరమని అన్నారు. శిల్పం కోసం తొలిగా 'ఆంధ్ర శిల్పకళా పరిషత్'ను ప్రారంభించి, కార్యదర్శిగా అమూల్యమైన గ్రంథాలను వెలువరించారని గుర్తుచేశారు స్వర్ణసుబ్రహ్మణ్యకవిచే 'భారతీయ మహాశిల్పం' అనే గ్రంథాన్ని 16 భాగాలను తీసుకొచ్చిన ఘనుడని తెలిపారు. దేవదాయశాఖలో స్థపతి వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు, తిరుమలలో శ్రీవేంకటేశ్వర సంప్రదాయ శిల్పశిక్షణ శాల, తదుపరి దేవదాయశాఖలో శిల్పశిక్షణ శాల ఆవిర్భావానికి డాక్టర్ కొండూరు కారకులని వివరించారు. ఆయన పేరిట 1996 నుంచి అవార్డును ప్రదానం చేస్తుండటం అభినందనీయమన్నారు. సభలో డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు పురస్కారాన్ని ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబుకు ప్రదానం చేశారు. దీనికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సభలో అలంపురి బ్రహ్మానందం రచించిన 'శిల్పదర్శనాచార్య' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈఎల్‌వీ అప్పారావు స్వాగతం పలికారు. పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, వెలగా సుభాష్‌చంద్రబోస్, అలపర్తి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్, డాక్టర్ కొండూరు కుటుంబసభ్యులు శివప్రసాద్, స్వరాజ్యలక్ష్మి, సుమతి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సుభాష్‌బాబు దంపతులకు డాక్టర్ కొండూరు పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రత ఎంతో కీలకం

తెనాలి అర్బన్: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల నియంత్రణకు అందరూ సహకరించాలని 26వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్ పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫ్రై డే- డ్రై డే కార్యక్రమంలో భాగంగా పినపాడులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో డయేరియా, కలరా ప్రబలుతున్నాయని తెలిపారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ పరిశపోగు హనోకు, డాక్టర్ వేముల ప్రియాంకలు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమకాటు వలన జ్వరం, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మలేరియా నియంత్రణ అధికారులు చిరసాని ప్రభార్‌రెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్‌లు మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో విజయగౌరి, డీపీఎంవో జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి వంగాల పున్నారెడ్డి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల శివరామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కౌన్సిలర్ ఇస్మాయేల్, డాక్టర్ ప్రియాంక

ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

తెనాలి అర్బన్: చాకలి ఐలమ్మ సేవలు మరువరానివని వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పెదలంక వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రజకచెరువు వద్ద ఉన్న ఆమె విగ్రహానికి శుక్రవారం సాయంత్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల సమస్యలపై ఆమె అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అగ్రకుల దురంహకారాన్ని దీటుగా తిప్పికొట్టారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సెల్ ఉపాధ్యక్షులు మల్లిబోయిన బాజీ, తాడిబోయిన వెంకటకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధులు కొడాలి క్రాంతి, నాయకులు అక్కిదాసు కిరణ్, మల్లిబోయిన రాము,కుర్రా శ్రీను, పూని నాగేశ్వరరావు, డాక్టర్ సుబ్రమణ్యం, తాడిబోయిన నాగరాజు, మహేష్, కాళిదాసు సత్యం, మునిపల్లి వంశీ, షేక్ మీరావలి, సీమోను, చెన్నయ్య, కఠెవరపు శంకర్, పవన్, పెదలంక రాము, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గొరిగపూడిలో వైద్య శిబిరం

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గొరిగపూడి గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు జి.అబ్రహం లింకన్ వైద్య పరీక్షలు చేశారు. గ్రామ సర్పంచ్ గరిగపాటి మల్లిక శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు ప్రజలను పరీక్షించి పలు సూచనలు చేసి ఉచితంగా మందులు అందించాదరు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రా మ పెద్దలు వెంకటేశ్వరరావు, వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.